సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 1 । మార్చి । 2024



నవదంపతులకు గాయాలు
రోడ్డు ప్రమాదంలో నవదంపతులు ఉమేష్, వరలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్ ద్వారా కర్ణాటకలోని శిరా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. 8లో



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/13.1°

జిల్లా అంతటా గురువారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రిళ్లు స్వల్పంగా తగ్గడంతో వేకువజాముచ చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 32 మండలాల పరిధిలోని అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, థర్డ్ జండర్స్, డప్పు కళాకారులు, చేనేత, కల్లు గీత కార్మికులు, వివిధ తీవ్ర జబ్బులతో బాధపడుతున్న లబ్ధిదారులకు అందజేయడానికి పింఛన్ మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులు ఖాతాలకు జమ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య చెప్పారు. జిల్లాలో 2,73,620 మంది లబ్ధిదారులకు రూ.81,67,11,500 నిధులను జమ చేశామన్నారు.

సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక
గుంతకల్లు: ఉమ్మడి అనంతపురం జిల్లా సీనియర్ కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శివమణి (కదిరి), కపిల్‌దేవ్ (ఉద్దేహాళ్), సూరి (విడపనకల్లు), నరేష్ (తాడిపత్రి), అల్లీపీరా (గుంతకల్లు), హరి (పరిగి), ఆనంద్ (గుంతకల్లు), భార్గవ్ (యాడికి), ప్రదీప్ (మురడీ) మనోహార్ (గుంతకల్లు)ను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ నెల 3వ నుంచి 5 వరకు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

చింతపండుకు రికార్డు ధర
- 'పురం' మార్కెట్‌లో క్వింటా రూ.34 వేలు పలికిన వైనం



మార్కెట్‌కు గురువారం వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: చింతపండు రికార్డు ధర పలుకుతోంది. గురువారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఈ ఏడాది ఇప్పటి వరకు పలకని ధర పలికింది. మార్కెట్‌కు 2,438 క్వింటాళ్ల సరకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్టంగా రూ.34 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.12 వేల ప్రకారం పలికింది. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.10 వేలు, కనిష్టంగా రూ.4 వేలు, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి. ఇక బోటు రకం చింతపండు గరిష్టంగా రూ.3,500, కనిష్టంగా రూ.2,500, సరాసరిన రూ.3 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

పోక్సో కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు



పోలీసుల అదుపులో ఉన్న ముద్దాయిలు

పుట్టపర్తి టౌన్: పోక్సో కేసులో ఇద్దరు ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సెల్వరాజ్ అలియాస్ వడ్డీ కెల్లా సెల్వరాజ్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన చందిరన్ కుల్లప్పన్ అలియాస్ చంద్రుడు నల్లమాడ మండలంలో ఉన్న శ్రీధర్ గ్రానైట్ క్వారీలో పనిచేసేవారు. 2022న మే 15న ఓ బాలిక పొలంలో గడ్డి కోస్తుండగా బలాత్కారం చేశారు. బాలిక అరుపులు విని తల్లిదండ్రులు అక్కడికి రాగా, అక్కడి నుంచి పారిపోయారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ వలిబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతపురం స్పెషల్ సెషన్స్ జడ్జ్ (పోక్సో ట్రయల్ కేసెస్) కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏడుగురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. గురువారం తీర్పు వెలువరించారు. నేరం రుజువు కావడంతో నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి సూచించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, కానిస్టేబుల్ గంగాధర్‌ను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు.

పాడు బడిన భవనాలు... కంపు కొట్టే మరుగుదొడ్లు... కనిపించని కుర్చీలు, ఫ్యాన్లు ... అపరిశుభ్రతకు నిలయాలుగా మారిన పరిసరాలు... చదువు కోవాలంటేనే విద్యార్థులు విరక్తి చెందేవిధంగా ఉండేవి ప్రభుత్వ పాఠశాలలు. అయితే ఇదంతా గతం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద రూ.కోట్ల నిధులు ఖర్చు చేయడంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. సకల సౌకర్యాల మధ్య పిల్లలు సంతోషంగా పాఠశాలలకు వెళ్తున్నారు.



నాడు: ఒకప్పుడు అధ్వానంగా ఉన్న గుడిబండ మండలం శంకరగల్లు ప్రాథమిక పాఠశాల



నేడు: నూతన శోభను సంతరించుకున్న శంకరగల్లు ప్రాథమిక పాఠశాల

సర్కారు బడి.. వసతుల ఒడి

- నాడు – నేడు ద్వారా మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- అదనపు గదులు, ప్రహరీల నిర్మాణంతో తప్పిన ఇబ్బందులు
- ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువులు
- యూనిఫాం మొదలు పుస్తకాల వరకూ అన్నింటినీ అందిస్తున్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



మడకశిర మండలంలోని ప్రభుత్వ బడిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలలు 2019 ముందు అధ్వాన్నంగా ఉండేవి. అయితే చదువుకు ఉన్న విలువను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగానికి పెద్ద పీట వేశారు. ఇందులో భాగంగా నాడు–నేడు కార్యక్రమం కింద జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ పాఠశాల, కేజీబీవీల్లో అదనపు గదులు నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. అలాగే పాఠశాల చుట్టూ ప్రహరీల నిర్మాణానికి నిధులివ్వడంతో పాఠశాలలు సుందరంగా తయారయ్యాయి.

పనులు ఇలా...
'మన బడి నాడు–నేడు' కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ఎనిమిది రకాల పనులు చేపట్టింది. రక్షిత తాగునీటి కోసం నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు, బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, కరెంటు సౌకర్యం, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటు, తరగతి గదుల్లో ఫర్నీచర్, గ్రీన్ బోర్డుల ఏర్పాటు, పాఠశాల భవనాలకు పెయింటింగ్, పాఠశాల ప్రాంగణంలో గ్రానైట్ ఏర్పాటు తదితర పనులు చేపట్టారు.

మెను ప్రకారం భోజనం..
ప్రభుత్వ పాఠశాలలో రోజూ మెనూ మేరకు భోజనం వడ్డిస్తున్నారు. దీనికి తోడు రాగి జావా, చిక్కీలు ఇస్తున్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇవన్నీ అందిస్తుండటంతో విద్యార్థుల గురించి వారి తల్లిదండ్రులకు చింత తప్పింది.

అత్యాధునిక మరుగుదొడ్లు..
గతంలో మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయులు బాల, బాలికలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నాడు నేడు కింద విడుదలైన నిధులతో నేడు బాల,బాలికలు విడివిడిగా అధునాతనమైన మరుగుదొడ్లు నిర్మించారు. ప్రస్తుతం తరగతి గదిలో ఫ్యాన్లు, సౌకర్యవంతంగా బెంచీలు, విద్యుత్ ఏర్పాటు చేయడం ఏ ఇబ్బంది లేకుండా పోయింది. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ కోసం ఆయా పాఠశాలలో ఆయాలను నియమించి పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

అందరికీ బెంచీలు..
గతంలో విద్యార్థులు కుర్చీలు లేక ఇరుకు గదులలో కూర్చోలేక నానా అవస్థలు పడేవారు. అయితే నేడు ఆధునాతన ఎంతో నాణ్యమైన కుర్చీలు సమకూర్చారు. అవసరమైన తరగతి గదులు నిర్మించడంతో విద్యార్థులంతా కూర్చీలపై కూర్చొని పాఠాలు వింటున్నారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య..
ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడం, అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు ఇస్తుండటం, ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చడంతో జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరిగింది. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించడం, డిజిటల్ బోర్డులపై కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యా బోధన చేస్తుండటంతో ప్రభుత్వ బడుల్లో చేరేందుకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో సీట్లు లేవు బోర్డులు కూడా పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో నాడు–నేడు పనుల వివరాలు

మొత్తం పాఠశాలలు	2,087
విద్యార్థుల సంఖ్య	1,64,500
నాడు–నేడు తొలి విడత కింద ఎంపికైంది	596
నాడు–నేడు కోసం చేసిన ఖర్చు	రూ.171.72 కోట్లు
నాడు–నేడు రెండవ దశ కింద ఎంపికైన స్కూల్స్	1,081
ఖర్చు చేసిన మొత్తం	రూ.316.56 కోట్లు

చదువుకు జగనన్న భరోసా



గతంలో మా బడి సరిగ్గా ఉండేది కాదు. అయితే జగనన్న ఆధ్వర్యంలో నాడు–నేడు కింద నిధులు మంజూరు చేయడంతో మా పాఠశాల రూపురేఖలు మార్చేశారు. అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించటంతో పాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి బైజూస్ కంటెంట్‌తో అత్యుత్తమంగా బోధిస్తున్నారు. బాల బాలికలకు విడి విడిగా మూత్రశాలలు నిర్మించారు. ఇప్పుడు నేను సంతోషంగా బడికి వెళ్తున్నాను. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– శృతి, 10వ తరగతి కృష్ణాపురం, బుక్కపట్నం మండలం

ఆధునిక పద్ధతుల్లో బోధన



కార్పొరేట్ పాఠశాలల్లో కూడా ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో ఉన్న సౌకర్యాలు ఉండవు. అత్యాధునికమైన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన నీళ్లు, ఆహ్లాదకరమైన పరిసరాల నడుమ చదువుకుంటున్నాం. ఐఎఫ్‌పీ ప్యానళ్ల ఏర్పాటు చేయడంతో పాఠాలు కూడా సులువుగా అర్థం అవుతున్నాయి. అనుమానాలను కూడా ఉపాధ్యాయులు చక్కగా నివృత్తి చేస్తున్నారు.

– పూజిత, 8వ తరగతి, కృష్ణాపురం, బుక్కపట్నం మండలం

జగన్ సార్ చాలా గ్రేట్



విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన జగన్ సార్ చాలా గ్రేట్. దేశంలో మరే రాష్ట్రంలోనూ మన దగ్గర జరుగుతున్న విద్యాభివృద్ధి కనిపించడం లేదు. రూ.25 లక్షలతో 'నాడు నేడు'ద్వారా పనులు చేయడంతో మా బడి నూతన శోభను సంతరించుకుంది. గతంలో మా బడిలో తక్కువ మంది విద్యార్థులు ఉండే వారు. ఇప్పుడు మా పాఠశాలలో ప్రస్తుతం 267 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏ సమస్యలు లేకపోవడంతో విద్యార్థులంతా సంతోషంగా చదువుకుంటున్నారు.

– బాలాజీ, హెచ్‌ఎం, కృష్ణాపురం, బుక్కపట్నం మండలం

నేడు 'జగనన్న విద్యా దీవెన' విడుదల
- జిల్లాలో 31,151 మంది తల్లుల ఖాతాల్లో జమ కానున్న రూ.23.84 కోట్లు

పుట్టపర్తి: పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 'జగనన్న విద్యా దీవెన' పథకం ద్వారా చేయూతనందిస్తోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల ఫీజులను తల్లుల ఖాతాల్లో జమ చేసేందుకు సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రులో జరిగే సమావేశంలో కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో 34,169 మంది విద్యార్థులకు సంబంధించి 31,151మంది తల్లుల ఖాతాల్లో రూ. 23.84 కోట్ల నగదు జమ కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

సత్యసాయి ట్రస్టు సేవల విస్తరణకు కృషి
- సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్‌రాజు



బాగల్‌కోట్‌లో నిర్మించిన పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: విద్య, వైద్య, సామాజిక సేవా రంగాల్లో సత్యసాయి ట్రస్టు సేవలు మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ (విజయపుర), బాగళ్‌కోట్‌లో నూతన పాఠశాలల భవనాలను ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు మనోహన్ శెట్టి ప్రారంభించారు. అక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సైతం ప్రారంభించారు. చాలా సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కర్ణాటక సత్యసాయి సేవా సంస్థలు రూ.2.60 కోట్లు వెచ్చించి నూతనంగా నిర్మించారు. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు నిర్వహించేందుకు వీలుగా ఈ భవనాన్ని నిర్మించారు. బాగళ్‌కోట్‌లో రూ.1.60 కోట్లు వెచ్చించి మరో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆర్‌జె.రత్నాకర్ రాజు మాట్లాడుతూ రాబోవు తరాలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యం పనిచేస్తున్నట్లు తెలిపారు.

5న బహిరంగ వేలం
కదిరి టౌన్: ఖాద్రీ బ్రహ్మోత్సవాలను ఈనెల 19వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఖాద్రీ ఆలయం చుట్టూ ఉన్న అంగళ్ల రుసుములు వసూలు చేసేందుకు 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ధరావత్తు రూ.3 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

తండాల అభివృద్ధికి ప్రణాళికలు

- త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్న కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని వివిధ గిరిజన తండాల ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి మెరుగైన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారా సేవా సంఘం సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నారన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తండాలను సందర్శించి మౌలిక వసతులు గుర్తించి వారి సంక్షేమానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తండాల్లో సురక్షితమైన తాగునీటి కోసం జలజీవన్ మిషన్ కింద పనులు పూర్తి చేసి కొళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నారు. చంద్రనాయక్ తండా, మడుగుతండా, గొల్లపల్లి తండా, నాగినాయిని చెరువు తండా, నల్లగుట్టతండా తదితర తండాలలో పీడబ్ల్యూస్ స్కీము కింద తాగునీటి పనులు పూర్తి చేయాలన్నారు. ఎస్టీ గ్రాంటు కింద వివిధ రకాల పనులు చేపట్టాలన్నారు. ఈ పనులను జెడ్పీ సీఈఓ, జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతం చేయాలన్నారు. సీసీ రోడ్ల పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కదిరి మున్సిపాలిటీలో బంజారాభవన్‌కు స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత బంజారా సంఘం జనరల్ సెక్రెటరీ చక్రేనాయక్, జిల్లా కార్యదర్శి కాలేనాయక్, అదనపు సెక్రెటరీ రంగనాథ్‌నాయక్, డీఆర్‌ఓ కొండయ్య, గిరిజన సంక్షేమశాఖ అధికారి మోహన్‌రాం , ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ
పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య శ్రీకార్డులను వేగంగా పంపిణీ చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ అరుణణ్‌బాబు కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీకార్డులు 23 శాతం పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరగా పంపిణీ చేయాలన్నారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కూడా వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు

మా 'స్థాయి'ని దిగజారుస్తారా?

- జెడ్పీ సీఈఓ తీరుపై జెడ్పీటీసీల నిరసన
- స్థాయీ సంఘ సమావేశాల బాయ్‌కాట్



సీఈఓ తీరుపై నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యులకు మద్దతుగా మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: దళిత జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజును జెడ్పీ సీఈఓ అవమానించారంటూ సభ్యులు నిరసన తెలిపారు. సదరు సభ్యుడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని జెడ్పీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు గురువారం ఉదయం 11.30కు ప్రారంభమయ్యాయి. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చర్చను ప్రారంభిస్తుండగా.. గుడిబండ జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు , వజ్రకరూరు జెడ్పీటీసీ సభ్యురాలు కురుబ తేజస్విని సహా మరికొంత మంది పోడియం ముందు బైఠాయించారు. తమ మండలంలో చేసిన, చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకు రెండు రోజుల క్రితం జెడ్పీ కార్యాలయానికి వస్తే జెడ్పీ సీఈఓ అవమానించారని భూతరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు సీఈఓ రెండు గంటలైనా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోగా, ఆ తరువాత పిలిచి అగౌరవపరిచారని వాపోయారు. 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు' అంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుంటే, బాధ్యత గల హోదాలో ఉన్న అధికారిణి చిన్నచూపు చూడటం సరికాదన్నారు. జెడ్పీటీసీ భూత్‌రాజుకు సహచర సభ్యులు సంఘీభావం తెలిపారు. సీఈఓ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ కూడా వేదిక పై నుంచి వచ్చి వారికి మద్దతు తెలిపారు. ఈ క్రమంలోనే సీఈఓ నిదియాదేవి సమావేశం నుంచి వెళ్లిపోవడంతో, సభ్యులు కూడా బాయ్ కాట్ చేశారు.

టీడీపీ కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు ఎలా పంచుతారు?
పనులు చేసిన కాంట్రాక్టర్లందరినీ సమానంగా చూడాల్సిన జెడ్పీ అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొంటూ టీడీపీ కాంట్రాక్టర్ల కొమ్ము కాస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. తాగునీటి పథకాల ఆపరేషన్, మెయింటెనెన్స్(ఓఅండ్ఎం)కు సంబంధించి గతంలో సీఈఓగా పని చేసిన అధికారితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, ఈఈ, జెడ్పీలోని డి సెక్షన్‌లో పని చేసే ఓ సీనియర్ అసిస్టెంట్ జత కలసి.. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ల బిల్లులు అప్‌లోడ్ చేసి, వారికి కోట్లకు కోట్లు ఎలా చెల్లిస్తారని సభ్యులు నిలదీశారు. మిగతా కాంట్రాక్టర్లకు మాత్రం పైసా చెల్లించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారా అంటూ నిలదీశారు. పర్సంటేజీల కోసమే ఇలా చేశారని ఆరోపించారు. వాటిని రద్దు చేసి, కొత్త సీఈఓతో బిల్లులు చేయించాలని ఏకగ్రీవంగా తీర్మానించినా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు. సమాధానం చెప్పాలంటూ పట్టుబట్టారు. జెడ్పీ సీఈఓ నిదియాదేవి, డిప్యూటీ సీఈఓ లలితాబాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, ఈఈ, డి సెక్షన్‌లోని ఓ సీనియర్ అసిస్టెంట్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాల్సిందేనని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రెండు రోజుల్లో తమ సమస్య పరిష్కారం కాకపోతే.. నేరుగా విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి తమ సమస్యను విన్నవిస్తామని స్పష్టం చేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కొత్తచెరువులో పరీక్షా హాలును పరిశీలిస్తున్న ఇంటర్ విద్యాధికారి రఘునాథరెడ్డి

పుట్టపర్తి: ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. నేటి నుంచి 20వ తేదీ వరకూ జరిగే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జిల్లాలో 22,514 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. 41 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 21 పోలీస్‌స్టేషన్‌లలో పరీక్షా పత్రాలను భద్రపరిచారు. పరీక్షకు ముందు అధికారులు పరీక్షా పత్రాలను ఆయా కేంద్రాలకు తరలిస్తారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..
శుక్రవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షల కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా హాలులో తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామని, వారికి తోడు పోలీసులు మిగిలిన విద్యాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని వెల్లడించారు.

8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి..
పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రఘునాథ్‌రెడ్డి సూచించారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులు కచ్చితంగా హాల్‌టికెట్ తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడుపుతుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసేయాల్సిందేనని స్పష్టం చేశారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఉంటుందని తెలియజేశారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి



ఎస్పీ మాధవరెడ్డిని కలసిన కమిటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: పోలీసు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డిని పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు కోరారు. జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన నీలవేణి, నూర్‌మహమ్మద్‌తో కలసి ఎస్పీని గురువారం వారు మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి, పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. ఎస్పీని కలిసిన వారిలో అడహక్ కమిటీ రాష్ట్ర సభ్యుడు సూర్య కుమార్, ఉమ్మడి జిల్లా సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్ ఉన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన శ్రీసత్యసాయి జిల్లావాసులు



గంగదేవిపల్లి ఔట్ రీచ్ సెంటర్ వద్ద శ్రీసత్యసాయిజిల్లా వాసులు

గీసుకొండ: తెలంగాణలోని వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని గురువారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలోని 18 గ్రామాలకు చెందిన 45 మంది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ లీడర్లు సందర్శించారు. ఆ జిల్లాకు చెందిన రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ పర్యటన ఏర్పాటు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పలు కమిటీల ద్వారా గంగదేవిపల్లి వాసులు సాధించిన అభివృద్ధి, ఆదర్శంగా నిలిచిన తీరును వారికి జిల్లా ట్రెనింగ్ మేనేజర్లు కూసం రాజమౌళి, వనపర్తి కరుణాకర్ వివరించారు. ట్రస్ట్ ట్రైనర్ వి.రామాంజనేయులు, ఏరియా టీం లీడర్ సుదర్శన్‌రెడ్డి, బాల వికాస అసిస్టెంట్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ కొప్పుల రమాదేవి, కడారి అశోక్, గూడ సరోజన, మేడిద సుశీల తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్ దుర్మరణం



మృతుడు బాషా

చిలమత్తూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిన ఓ పెయింటర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం కోడూరు థామస్‌మన్రో తోపునకు చెందిన బాషా (30) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం హిందూపురం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆయన గాడ్రాళ్లపల్లి వద్దకు చేరుకోగానే 544ఈ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తప్పు చేస్తే బుక్ అవుతారు!

- ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు
- పరీక్షల నిర్వహణలో ఆధునిక సాంకేతికత
- పేపరు లీకైతే ఏ విద్యార్థికి కేటాయించిందో ఇట్టే తెలిసిపోతుంది
- తప్పిదాలకు జైలు శిక్ష తప్పదన్న ఆర్జేడీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ సారి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు, విధుల్లో ఉండే ఉద్యోగులు ఏ మాత్రం పేపర్ లీక్‌కు కారణమైతే అడ్డంగా బుక్ అయిపోతారు. ఇందుకు సంబంధించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం సమకూర్చుకుంది. ఈ నెల 18వ తేదీ నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయి. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుంది.

గత ప్రభుత్వంలో లీకుల పర్వం..

గత ప్రభుత్వంలో పదో తరగతి పరీక్షల సమయంలో పేపరు లీకై రాష్ట్రమంతా హల్‌చల్ అయ్యేది. అధికార యంత్రాంగం ఎంత పకడ్బందీ చర్యలు తీసుకున్నా రాష్ట్రంలో ఎక్కడో ఓ చోట పేపరు లీకు వార్తలు వెలుగు చూసేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చింది. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. మెరుగైన మానవ వనరులను ఈ ప్రపంచానికి అందించే క్రమంలో ఇంత కాలం ప్రభుత్వం పడిన శ్రమకు ఆశించిన మేర ఫలితాలు దక్కాయి. ఇప్పటి వరకూ అన్నింటా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందజలో నిలుస్తూ వచ్చారు.

లీకు వీరులెవరో తెలిసిపోతుంది..

పొరబాటున ఎవరైనా లీక్ చేసినా ఆ ప్రశ్నపత్రం ఏ సెంటర్ నుంచి వచ్చింది, ఆ సెంటర్‌లోని ఏ గది విద్యార్థికి సంబంధించినది కూడా ఇట్టే తెలిసిపోయే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ప్రశ్నపత్రం బయటకు తీసుకొచ్చి జిరాక్స్ చేయించినా, ఫొటో తీసినా అందులో పొందుపరిచిన కంటికి కనిపించని నంబరు ఆధారంగా ఏ కేంద్రంలోని విద్యార్థికి చెందినదో తెలిసిపోతుంది. దీంతో అసలు కారకులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం..

గతంలో ఎన్నడూ లేని విధంగా పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పించనున్నారు. హాల్‌టికెట్ చూపిస్తే చాలు ప్రయాణం చేయొచ్చు. అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుంది. పరీక్ష కేంద్రాలు కలిగిన రూట్లకు, పరీక్షల వేళలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఈ బస్సులను నడపనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఇలా			
జిల్లా	ప్రభుత్వ	ప్రైవేట్	సెంటర్లు
అనంతపురం	31,330	8,733	142
శ్రీసత్యసాయి	22,002	5,553	115
మొత్తం	40,063	27,555	257

ఫెయిల్ అయిన విద్యార్థులకు చివరి అవకాశం

ఈసారి పాత సిలబస్‌తో పరీక్షలు ఉంటాయి. వచ్చే సంవత్సరం నుంచి మారిన కొత్త సిలబస్‌కు అనుగుణంగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇదే చివరి మంచి అవకాశం. పరీక్ష ఫీజు చెల్లించిన ఫెయిలైన విద్యార్థులందరూ ఈసారి పరీక్షలు రాసే అవకాశాన్ని మిస్ కావొద్దంటూ అధికారులు కోరుతున్నారు.

ప్రశాంతంగా జరగాలి: ఆర్జేడీ

ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా చూడాలని ప్రాథమిక విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రాఘవరెడ్డి ఆదేశించారు. పది పరీక్షల నిర్వహణపై గురువారం అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో ఆయన సమీక్షించారు. పరీక్షల నిర్వహణ బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులపై ఉంటుందన్నారు. ప్రతి కేంద్రంలోనూ సీఎస్‌లు, డీఓలు, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పని చేస్తే ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. మీడియా, ప్రైవేట్ వ్యక్తులెవరినీ కేంద్రాల్లోకి అనుమతించొద్దన్నారు. పరీక్షల సమయంలో అక్కడ విధుల్లో ఉండే పోలీసులు, ఏఎన్ఎం, ఇన్విజిలేటర్లు, అటెండర్ల మొబైల్ ఫోన్లను చీఫ్ సూపరింటెండెంట్ వద్ద డిపాజిట్ చేసుకోవాలన్నారు. నామినల్ రోల్‌లో పేపర్‌కోడ్, మీడియం విషయంలో విద్యార్థి ఏదైనా సవరణలు రాతపూర్వకంగా కోరితేనే చేయాలన్నారు. ఫొటో అటెండెన్స్ షీట్‌లో విద్యార్థులు, ఇన్విజిలేటర్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఓఎంఆర్ షీట్‌లో పార్ట్–1,2,3 విభాగాలు ఉంటాయన్నారు. గణితం పరీక్ష రోజు గ్రాఫ్ పేపరును, సోషల్ పరీక్ష రోజు మ్యాప్ పేపర్‌ను జవాబు పత్రానికి అనుసంధానించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీలో ఈసారి ప్రభుత్వం సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిందని, ఎక్కడ బయటకు వచ్చినా కారకులు దొరికిపోతారని హెచ్చరించారు. చివరికు మొబైల్‌లో ప్రశ్నపత్రం ఫొటో తీసి బయటకు పంపితే ఏ నంబరు మొబైల్ నుంచి తీసిందో కూడా తెలిసిపోతుందన్నారు. ఎవరిస్థాయిలో వారు జాగ్రత్తగా పని చేయాలని, ఏదైనా తప్పిదాలకు కారకులైతే మాత్రం కటకటాల పాలవుతారని హెచ్చరించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ



దత్తారెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీసత్యసాయి, వైజాగ్ జట్లు గెలుపొందాయి. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్‌కు అద్భుతమైన సౌకర్యాలు కల్పిస్తున్న ఆర్డీటీని అభినందించారు. అనంతరం ఏపీ రంజీ జట్టుకు ఎంపికైన ఎంకే దత్తారెడ్డిని సన్మానించారు. అలాగే కలెక్టర్ అరుణ్‌బాబును ఏపీడబ్ల్యూజేయూ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వెంకటేష్, ఖాన్, షాకీర్, విజయ్‌రాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వక్క తోటలో గంజాయి సాగు

గుడిబండ: మండలంలోని మందలపల్లిలో గంజాయి సాగు కలకలం రేపింది. వక్క తోటల మధ్య అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైతు హనుమంతరాయప్ప తోటలో13 గంజాయి మొక్కలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. తనిఖీల్లో సీఐ రాజ్‌కుమార్, సెబ్ అధికారి ధీరజ్‌రెడ్డి, ఎస్ఐ మునిప్రతాప్, పోలీస్ సిబ్బంది, ఏఓ వీరనరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో డీసీఎంఎస్

- బోర్డు మీటింగ్‌లో చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అందిస్తున్న సేవల కారణంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ను అభివృద్ధి బాట పట్టించినట్లు ఆ సొసైటీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన బోర్డు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా రైతులకు అందించే సేవలు, ప్రధానంగా ఎరువుల పంపిణీ, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.11.54 కోట్లకు పైగా విలువ చేసే ఎరువులు, రూ.25,.45 లక్షల పురుగు మందులు, ఇతర వ్యాపారాల ద్వారా రూ.1.02 కోట్లు... మొత్తంగా రూ.12.82 కోట్ల మేర లావాదేవీలు జరిగాయన్నారు. జగన్ సర్కారు అందిస్తున్న ప్రోత్సాహంతో అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ, కళ్యాణదుర్గం డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ముమ్ముందు మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.శ్రీరామరెడ్డి, జబీవుల్లా, క్రిష్టప్ప, సుమంగళమ్మ, నాగమ్మ, బిజినెస్ మేనేజర్ టి.విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డీసీఎంఎస్ బోర్డు మీటింగ్‌లో పాల్గొన్న తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, బోర్డు సభ్యులు, అధికారులు

ప్రమాదంలో నవ దంపతులకు గాయాలు

రొళ్ల: రోడ్డు ప్రమాదంలో నవదంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... అగళి మండలం నందరాజనహళ్లి చెందిన ఉమేష్‌కు జనవరి 21న కర్ణాటకలోని తిప్పగానహళ్లికి చెందిన వరలక్ష్మితో వివాహమైంది. గురువారం అత్తారింటి నుంచి భార్యతో కలసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై ఉమేష్ బయలుదేరాడు. రత్నగిరి గ్రామంలో హొసకెర వెళ్లే ఆర్చ్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో కింద పడిన ఉమేష్, వరలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కర్ణాటకలోని శిరా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు.

నగల దుకాణంలో బంగారు గొలుసు చోరీ

- వెంబడించి దొంగను పట్టుకున్న స్థానికులు



స్థానికుల చేతికి చిక్కిన దుండగుడు

రాయదుర్గం టౌన్: స్థానిక వినాయక సర్కిల్‌లోని గణేష్ జువెలరీ షాపులో ఓ వ్యక్తి సినీఫక్కీలో రెండు తులాల బంగారు గొలుసు చోరీ చేసి, ఉడాయించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంబడించి దుండగుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు... గురువారం రాత్రి 8 గంటలకు గొలుసు కొనుగోలు చేసేందుకు వచ్చిన అపరిచిత వ్యక్తి... యజమాని జగన్నాథ్ కళ్లు కప్పి రెండు తులాల బంగారు గొలుసును తీసుకుని ఉడాయించాడు. యజమానితోపాటు గమనించిన స్థానికులు వెంటనే వెంటపడ్డారు. కొద్ది దూరంలోనే మొలకాల్మూరు రోడ్డు బెస్ట్ షాపింగ్ మాల్ వద్ద పట్టుకుని దేహశుద్ధి చేశారు. గొలుసు స్వాధీనం చేసుకుని పేరు, ఊరు అడిగితే చెప్పకపోవడంతో పోలీసులకు అప్పగించారు. దుండగుడిని పోలీసులు విచారణ చేస్తున్నారు.

తనిఖీలు సక్రమంగా చేపట్టండి

హిందూపురం అర్బన్/చిలమత్తూరు: చెక్‌పోస్టుల్లో తనిఖీలు సక్రమంగా చేపట్టాలని మద్యం, గుట్కా, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకోవాలని సిబ్బందిని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. పనితీరు మార్చుకోక పోతే మార్పాల్సి వస్తుందని హెచ్చరించారు. గురువారం రాత్రి 8.30 గంటలకు ఆయన కొడికొండ, తూముకుంట చెక్కపోస్టులను తనిఖీ చేశారు. గంటకు పైగా కొడికొండ చెక్‌పోస్టులో స్వయంగా వాహనాల తనిఖీ చేపట్టారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టెంట్‌లో సీసీ కెమెరాల పనితీరు సక్రమంగా లేకపోవడం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. కర్ణాటక సరిహద్దున ఉన్న జిల్లాలోని సోమఘట్ట, మరువకొత్తపల్లి, సంతేబిదనూరు వద్ద ఎన్నికలు ముగిసే వరకూ ప్రత్యేక సిబ్బందిని ఉంచి అక్రమ రవాణాను అడ్డుకుంటామని పేర్కొన్నారు.



వాహన తనిఖీలు పరిశీలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

కబడ్డీలో జిల్లా ఖ్యాతిని చాటండి

బత్తలపల్లి: నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని చాటాలని క్రీడాకారులకు పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గురువారం బత్తలపల్లిలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో సీనియర్స్ విభాగంలో పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఈ ప్రక్రియకు జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో సిసింద్రీ, రాజశేఖర్, మధు, ఎస్.గణేష్, కె.గణేష్, సి.గంగాశేఖర్, నవీన్, కె.నాగాశేఖర్, శ్రీనివాసులు, బి.సాయికుమార్, వంశీ, ఎం.నరేష్, మణిదీప్, పి.జగదీష్, ఎం.డి.ప్రదీప్, నరేంద్ర, ఎ.విష్ణు ఉన్నారు. వీరు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ నెల్లూరు జిల్లా కోవూరులో జరిగే 70వ రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాగిరి రామయ్య తెలిపారు. క్రీడాకారులను ఆర్డీటీ ఆర్‌డీ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రామతేజ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్ ఆచారి, మంజుల వెంకటేష్, సెలక్షన్ కమిటీ నరసింహులు, జగదీష్, లాల్‌బాషా అభినందించారు.



పోటీలకు ఎంపికైన పురుషుల కబడ్డీ జట్టుతో నిర్వాహకులు

కాయ్ రాజా కాయ్

- 'పల్లె' కే టికెట్... కాదని పందెం కాస్తే రూ. 10 లక్షలకు రూ. 12 లక్షలిస్తా
- ఫేస్‌బుక్‌లో హల్ చల్ చేసిన తెలుగు యువత నాయకుడు
- హెచ్చరించి వదిలేసిన పోలీసులు

పుట్టపర్తి రూరల్: ఎన్నికల సమీపిస్తున్న వేళ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో ఆ పార్టీ నేతలు ఆందోళనలో మునిగిపోయారు. ఎవరికి టికెట్ దక్కుతుందో తెలియక సతమతమవుతున్నారు. కొందరు నేతలకు సీటులేదంట అంటూ వైరి వర్గం ప్రచారం చేస్తుండగా, సదరు నేతల అనుచరులు తమ నాయకుడికి మద్దతుగా రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలోనే పుట్టపర్తిలో తెలుగు యువత నాయకుడు ఊరి వాకిలి సురేష్ నాయుడు రూ.10 లక్షల డబ్బుతో ఫేస్‌బుక్ లైవ్‌లో హల్‌చల్ చేశాడు. 'పల్లె రఘునాథ్ రెడ్డికే పుట్టపర్తి టీడీపీ టికెట్... కాదని ఎవరొస్తారో రండి' అంటూ సవాల్ విసిరాడు. కాయ్ రాజా కాయ్ అంటూ రూ.10 లక్షలకు రూ.12 లక్షలు ఇస్తామంటూ బుధవారం ఓ టీ కొట్టు వద్ద రూ.500 నోట్ల కట్టలు ప్రదర్శిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. త్వరపడండి, రూ.10 లక్షలకు రూ.11 లక్షలు అంటూ మొదలుపెట్టి రూ.10 లక్షలకు రూ.12 లక్షలు ఇస్తానంటూ ఫేస్‌బుక్‌లో మెసేజ్‌లు పెట్టసాగాడు. గురువారం సాయంత్రం వరకూ ఫేస్‌బుక్‌లో ఫాలోయర్స్‌లో తీవ్ర చర్చ కొనసాగింది. ఇలా బెట్టింగులకు బహిరంగంగా పిలుపునివ్వడంపై జనం నివ్వెరపోయారు. పుట్టపర్తి టీడీపీ టికెట్ బీసీలకు ఇస్తారని, పల్లెకు రాదంటూ ఆ పార్టీలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఈ విషయంపై విభేదించిన సురేష్.... పల్లెపై తన స్వామి భక్తిని బాహాటంగా ఇలా ప్రదర్శించాడు. విషయం పోలీసులకు తెలియడంతో గురువారం రాత్రి తెలుగు యువత నాయకుడిని పోలీస్ స్టేషన్‌కి పిలిపించారు. అంత డబ్బు నీకెక్కడిదని విచారించారు. ఇంతలోనే టీడీపీ, జనసేన నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. వారిలో కొందరు తాము వ్యాపారం నిమిత్తం సురేష్ దగ్గర డబ్బు ఉంచామని పోలీసులకు తెలిపారు. ఎన్నికల సమయంలో డబ్బులు ప్రదర్శించడం నేరమని, బెట్టింగ్‌లు కాస్తే చర్యలు తీసుకుంటామని సీఐ కొండారెడ్డి వారిని హెచ్చరించి వదిలేశారు.



కాయ్ రాజా కాయ్ అంటూ నోట్ల కట్టలు ప్రదర్శిస్తున్న తెలుగు యువత నాయకుడు సురేష్ నాయుడు

లీపు బేబీలు



అనంతపురం మెడికల్: నాలుగేళ్లకు ఒకసారి వచ్చే ఫిబ్రవరి 29న అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో 14 మంది శిశువులు జన్మించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ జరిగిన కాన్పుల్లో ఎనిమిది మంది ఆడశిశువులు ఉండడం గమనార్హం. లీపు రోజున పుట్టిన వీరిని ఆస్పత్రి సిబ్బంది అపురూపంగా చూసుకున్నారు.

కల్యాణం.. కమనీయం





కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

హిందూపురం: పట్టణంలోని ఆర్‌పీజీటీ రోడ్డులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటరమణస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదికపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. ప్రత్యేక అలంకరణ అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణం చూసి తరించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ఊరేగించారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు